క్లుప్తంగా

మహాసముద్రం నరసింహారెడ్డి మృతి


ఎం.నరసింహారెడ్డి (ఫైల్)

పెనుమూరు(కార్వేటినగరం): వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.దయాసాగర రెడ్డి తండ్రి వైఎస్సార్ సీపీ మండల గౌరవ అధ్యక్షుడు మహాసముద్రం నరసింహారెడ్డి (87) ఆదివారం మృతి చెందారు. ఈయన ను శనివారం రాత్రి చికిత్స కోసం వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యులు ఇతర దేశాల్లో స్థిరపడడంతో వారు వచ్చాక బుధవారం స్వగ్రామం పులికల్లులో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మీ ఆడబిడ్డను గెలిపించండి


ప్రచారం చేస్తున్న మంత్రి రోజా కుటుంబ సభ్యులు

నగరి: నగరి ఆడబిడ్డ ఆర్కే రోజాను గెలిపించండి అంటూ మంత్రి ఆర్కే.రోజా కుటుంబసభ్యులు లక్ష్మి, సుమతి, ఝాన్సీ, సరస్వతి, లావణ్య మున్సిపల్ పరిధి సత్రవాడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారితో పాటు పార్టీ మహిళాశ్రేణులు జతకట్టారు. మరమగ్గ కార్మికులను కలిసిన వారు మానవత్వానికి ప్రతిరూపమైన రోజాను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

తమిళనాడు మద్యం తరలిస్తూ ..

కార్వేటినగరం: తమిళనాడు నుంచి అక్రమంగా మద్యం బాటిళ్లు తెస్తున్న టీడీపీ నాయకులు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు. వివరాలు.. కొటార్వేడు గ్రామానికి చెందిన వినోద్, వరదరాజులు తమిళనాడు నుంచి 28 క్వాటర్ బాటిళ్లను బైక్‌లో తెస్తూ కనికాపురం వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసి, మద్యం బాటిళ్లతో పాటు రెండు బైక్‌లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యతోనే సంపద సృష్టి

- ఆర్థిక అసమానతలు తొలగాలంటే జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాలి
- ఓటు అడిగే అర్హత బాబుకు లేదు
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి


తిరుమలయ్యపల్లెలో ఓటర్లకు అభివాదం చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి


పిల్లన గ్రోవి ఊదుతూ నృత్యం చేస్తున్న మంత్రి

వెదురుకుప్పం: రాజకీయ, ఆర్థిక అసమానతలు తొలగి బడుగు, బలహీన వర్గాల్లో కొత్త వెలుగులు రావాలంటే జగనన్నను మళ్లీ సీఎంను చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని తిరుమలయ్యపల్లె సచివాలయ పరిధిలోని మొరవ, వేణుగోపాలపురం ఎస్సీ కాలనీ, మొరవ మోడల్ కాలనీ, వేణుగోపాలపురం, చెంచుగుడి, ఎస్సీ కాలనీ, బాలుపల్లె, వావిల్ చేను, కొండకిందపల్లె, గుర్రంవారికండ్రిగ, సుందరాంగిణిపల్లె, వడ్డి ఇండ్లు, ఆవుల రెడ్డి కండ్రిగ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ విద్య ద్వారానే సంపద సృష్టించగలమన్న సంకల్పంతో సీఎం జగనన్న విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. జగనన్న హయాంలో వర్గవైషమ్యాలను పక్కన పెట్టి కేవలం అర్హతే ప్రామాణికంగా తీసుకుని ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చినట్లు గుర్తు చేశారు. కానీ చంద్రబాబుకు ఓటు వేస్తే కులమతాల మధ్య చిచ్చు, రాజకీయ వివక్ష చూపి ప్రజలను వేధింపులకు గురిచేస్తాడన్నారు. అయితే సీఎం జగన్ మాత్రం ఈసారి నవరత్నాల ప్లస్ పథకాల ద్వారా బలహీనవర్గాల అభ్యున్నతికి మరింత ఊతమిస్తున్నట్లు చెప్పారు.

జోరుగా..హుషారుగా ప్రచారం

మండుటెండను సైతం లెక్క చేయకుండా తిరుమలయ్యపల్లె పంచాయతీలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ముందుగా స్థానిక సర్పంచ్ భారతి ఆధ్వర్యంలో క్రేన్ సాయంతో భారీ గజమాల వేసి ఆహ్వానించారు. ప్రతి ఇంటా మహిళలు మంగళ హారతులు పట్టి పూల వర్షం కురిపించారు. వేణుగోపాలపురం గ్రామంలో డిప్యూటీ సీఎం పిల్లన గ్రోవి ఊదుతూ నృత్యం చేసి ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యండపల్లె శ్రీనివాసులు రెడ్డి, మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఉపాధ్యక్షుడు రామయ్య, జెడ్పీటీసీ సుకుమార్, రాష్ట్ర కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి హేమసుందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ అరుణ, జేసీఎస్ కన్వీనర్ సుబ్రమణ్యం, ఎంపీటీసీలు హరి, మునిచంద్రారెడ్డి, భాస్కర్, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, సర్పంచ్‌లు భారతి, గోవిందయ్య, నాయకులు మునిరెడ్డి, రోశిరెడ్డి, గోపాల్, పెద్దిరెడ్డి, చిన్నబ్బరెడ్డి, చిరంజీవిరెడ్డి, గోవిందన్, ప్రకాష్, భీమశంకర్‌రెడ్డి, లోకేష్ రెడ్డి, గోవిందరెడ్డి, వెంకటరెడ్డి, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

నేరచరిత్రకు కేరాఫ్ థామస్

- థామస్‌పై నిప్పులు చెరిగిన ఇందిరా ప్రియదర్శిని


ఇందిరా ప్రియదర్శిని

కార్వేటినగరం: చెన్నైలో నేరచరిత్రకు కేరాఫ్ అడ్రస్ డాక్టర్ థామస్ అని, అతనికి అడ్డువస్తే ఆడ, మగ అనే తేడా లేకుండా దారుణంగా హత్యాయత్నాలు, దాడులు చేయడమే ఆయన నైజం అని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుమార్తె ఇందిరా ప్రియదర్శిని అన్నారు. ఆదివారం ఆమె జర్మనీ నుంచి మీడియాతో మాట్లాడుతూ థామస్ ఓటమి భయంతో తన తండ్రి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామిపై, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తన సోదరి కృపాలక్ష్మిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. థామస్‌పై హత్యాయత్నం చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. ప్రత్యర్థులను రాజకీయంగా ఎదుర్కొంటామే తప్ప.. వ్యక్తిగతంగా కక్షలు పెంచుకోవాల్సిన అవసరం లేదన్నారు. థామస్‌పై చెన్నైలో హత్యాయత్నం, బెదిరింపు కేసులు ఎన్ని ఉన్నాయో అఫిడవిట్‌లో ఆయన అంగీకరించడం జరిగిందన్నారు. తన సోదరి కృపాలక్ష్మిని రాజకీయంగా ఎదుర్కోలేక లేనిపోని విషప్రచారం చేయడం దారుణమన్నారు. సీఎం జగనన్న ఐదేళ్లలో చేసిన అభివృద్ధే వచ్చే ఎన్నికల్లో విజయం అందిస్తే, గతంలో 14 ఏళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు చేసిన మోసాలే ఈ ఎన్నికల్లో టీడీపీని ఓడియస్తాన్నారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్


పుత్తూరులో ఓటు వేయడానికి వచ్చిన ఉద్యోగులు

పుత్తూరు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆదివారం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ తొలిరోజు ప్రశాంతంగా ముగిసింది. నగరి నియోజకవర్గానికి చెందిన మొత్తం 1150 ఓట్లకు గాను 955 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు నగరి ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డి మీడియాకు తెలిపారు. సోమవారం పోలింగ్ జరుగుతుందని తెలిపారు.

జీడీనెల్లూరులో 79.53 శాతం పోలింగ్

గంగాధర నెల్లూరు: జీడీనెల్లూరు నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధుల్లో పాల్గొననున్న ఉద్యోగులు 1,681 మందికి గానూ మొదటి రోజు 1337 మంది పోస్టల్ బ్యాలెట్ పద్ధతిలో ఓటు వేశారు. సోమవారం కూడా పోలింగ్ జరుగుతుందని ఆర్ఓ వెంకట శివ తెలిపారు.

ముస్లింల ద్రోహి చంద్రబాబు

పుత్తూరు: ముస్లింలకు అన్యాయం చేస్తున్న చంద్రబాబు కూటమిని ఎన్నికల్లో ఓడించాలని స్థానిక వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకుడు మాహిన్ ఓటర్లను అభ్యర్థించారు. ఆదివారం ఆయన గేట్ పుత్తూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కొనసాగిస్తానని భరోసా ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ కూటమిని ఓడించాలని కోరారు.

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి


క్రేన్‌తో పండ్లతో తయారు చేసిన భారీ గజమాలను వేసి కృపాలక్ష్మికి స్వాగతం పలుకుతున్న నేతలు

- జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: అవినీతి మరక అంటని అభివద్ధే ధ్యేయంగా ఐదేళ్లు ప్రజలకు సంక్షేమం అందించిన జగనన్న ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వండి అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేఅభ్యర్థి కృపాలక్ష్మి అన్నారు. మండలంలోని మంగుంట గ్రామంలో ప్రజలు ఆమెకు మంగళ హారతులతో నీరాజనం పలికారు. మంగుట దళితవాడలో క్రేన్ సహాయంతో భారీ పండ్లతో తయారు చేసిన గజమాల వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు దోచి పెడుతున్నారని ఏడ్చిన చంద్రబాబు, పవన్, లోకేష్ ఆ పథకాలు కొనసాగిస్తానని చెబుతున్నారని, ప్రజలు వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. ప్రస్తుతం అమలు చేస్తున్నా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ మణి, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ రూప, నాయకులు మునికృష్ణ, యువరాజ్, జనార్ధన్, రాజ, పురుషోత్తంరెడ్డి, శేషాద్రి, తురకాని, చంద్రరెడ్డి, బాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం

పెనుమూరు(కార్వేటినగరం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే పేదల సంక్షేమం సాధ్యమవుతుందని ఎంపీపీ మహాసముద్రం హేమలత రెడ్డి చెప్పారు. ఆదివారం పెనుమూరు మండలం ఉగ్రాణంపల్లెలో సర్పంచ్ ఐరాల మురళీకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, మండల యువత అధ్యక్షుడు లోకేష్‌రెడ్డి, జిల్లా యువత కార్యదర్శి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: పేదల కష్టాలు తెలిసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగించారని ఎంపీపీ లత అన్నారు. ఆదివారం మండల పరిధిలోని లక్ష్మీరాజపేట, కొత్తఇండ్లు, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ మండల కన్వీనర్ ధనుంజయవర్మ, సర్పంచ్ చిన్న, ఎంపీటీసీ మురగయ్య , తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేటలో..

పుత్తూరు: సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ నిలబెట్టాలని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వడమాలపేట మండలం కదిరిమంగళం, వెంగల్‌రాజు కండ్రిగ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్ అన్నారు. ఆదివారం నింద్రలో మేము సిద్ధం- మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభ, పార్టీ జిల్లా కార్యదర్శి మేరి, సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, దామోదరం, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ చేసిందేమీ లేదు

నగరి: నేత సామాజిక వర్గానికి టీడీపీ చేసిందేమీ లేదని ఆర్కే సెల్వమణి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రోజమ్మకు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు భూపాలన్, బీడీ భాస్కర్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రైన్ కింద పడి వ్యక్తి మృతి

నగరి: ట్రైన్ కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నగరి – వీఎస్‌ఆర్‌పేట మధ్య ఆదివారం చోటుచేసుకుంది. పీఎఫ్ నెం.2 వద్ద ఎగువ రైల్వే ట్రాక్‌పై సుమారు 30–35 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి ట్రైన్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రేణిగుంట రైల్వే ఎస్‌ఐ రవి ఘటనపై కేసు నమోదు చేశారు. మృతుడు సిమెంట్ కలర్‌లో తెల్లని అడ్డగీతలు ఉన్న టీషర్టు, లైట్ బ్లాక్ జీన్స్ ప్యాంట్ వేసుకున్నాడు. కుడి చేతికి స్టీల్ కడియం ఉంది. మృతదేహాన్ని నగరి ఆస్పత్రికి తరలించారు.

నియోజకవర్గ నగరి ముఖచిత్రం

నగరి.. గేట్ వే ఆఫ్ ఆంధ్రాపురి..


నగరి పట్టణం వ్యూ



ప్రస్తుతం నియోజకవర్గ ఓటర్లు 201447

పురుషులు : 98081

మహిళలు : 103358

ఇతరులు 3

1962లో ఓటర్లు 39855

- నగరి నియోజకవర్గ ముఖచిత్రం
- జీవన ప్రమాణాలు పెంచుకున్న నగరి
- ఇక్కడి ముక్కుకొండే ప్రాచీన లైట్‌హౌస్
- డివిజన్ స్థాయికి ఎదిగిన నియోజకవర్గం
- గిరుల మధ్య ఉండడంతో నగరిగా నామకరణం
- మరమగ్గ కార్మికులు అత్యధికంగా నివశించేది ఇక్కడే




నగరి : గిరుల నడుమ ఉన్న ప్రాంతం కావడంతో నగిరిగా, కాలక్రమేణా ఈ పట్టణానికి నగరిగా పేరు వచ్చిందని ప్రతీతి. రాయల పాలనలో, చోళ రాజుల పాలనలో ఇక్కడ ఆలయాలు, మండపాలు వెలిశాయి. కార్వేటినగరం రాజుల పాలనలో ఆలయాలను నవీకరించి వాటి మహత్యాన్ని కాపాడారు. 1232లో కార్వేటినగరం రాజులైన శ్రీ వెంకట పెరుమాళ్ రాజు, బ్రహ్మదేవ మహరాజ్ అనే వారు నిర్మించిన ప్రసిద్ధిగాంచిన ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం ఈ నియోజకవర్గంలోని అప్పలాయగుంటలో ఉంది. శ్రీ వెంకటపెరుమాళ్ రాజు పాలనకు గుర్తుగా రాష్ట్ర సరిహద్దులోని ఒక గ్రామానికి శ్రీ వెంకట పెరుమాళ్ రాజువారి పేట అనే నామకరణం చేశారు. ఈ ప్రాంతంలోని రైల్వేస్టేషన్ అతిపెద్ద పేరున్న రైల్వేస్టేషన్‌గా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లోకి ఎక్కింది. నగరికి చిహ్నంగా ఉన్న ముక్కుకొండ చెన్నై హార్బర్‌లోకి చేరుకునే షిప్‌లకు లైట్‌హౌస్‌గా ఉపయోగపడేది. తమిళనాడు సరిహద్దును ఆనుకుని ఉన్న ప్రాంతం కావడంతో గేట్ వే ఆఫ్ ఆంధ్రగా ప్రసిద్ధి పొందింది. తెలుగు, తమిళ భాషలు, సంప్రదాయాలు ఇక్కడ మిళితమై ఉంటాయి. రాష్ట్ర రాజకీయాలతో పాటు తమిళనాడుకు చెందిన రాజకీయాలతో ఇక్కడి వారికి సుపరిచయం ఉంటుంది. గ్రామస్థాయి నుంచి పంచాయతీకి, మేజర్ పంచాయతీకి ఎదిగిన నగరి 2005లో మున్సిపాలిటీగా మారింది. 2022 జిల్లా విభజన తరువాత నగరి డివిజన్‌గా మారింది. దీంతో ఆర్డీఓ కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం, ఆర్టీఓ కార్యాలయం ఇలా ఎన్నో ఉన్నత ప్రమాణాలతో నియోజకవర్గం రూపురేఖలు మారాయి.

రాజకీయ పోరు..

నగరి నియోజకవర్గం ఎప్పుడూ ఒక పార్టీకి పట్టం కట్టలేదు. ఇండిపెండెంట్లు సైతకం ఇక్కడ గెలుపొందారు. రాష్ట్రమంతా వచ్చే మార్పు నగరి నియోజకవర్గంపై ఎప్పుడూ ఉండదు. ఇక్కడ విజయం సాధించే వారంతా అతితక్కువ మెజారిటీతోనే విజయం సాధిస్తారు. 1962లో మొదటి ఎన్నికలు జరగగా ఇండిపెండెంట్ అభ్యర్థి దొమ్మరాజు గోపాల్ రాజు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిలారి గోపాల్‌నాయుడుపై 1537 ఓట్ల తేడా విజయం సాధించారు. 1967లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిలారి గోపాల్‌నాయుడు ఇండిపెండెంట్ అభ్యర్థి సిద్ధయ్యపై 7815 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1972లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిలారి గోపాల్‌నాయుడుకు తమిళనాడుకు చెందిన డీఎంకే పార్టీ ప్రత్యర్థిగా పోటీ చేసింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 28072 ఓట్ల తేడాతో గెలుపొందింది. 1978లో కాంగ్రెస్ పార్టీకి చెందిన రెడ్డివారి చెంగారెడ్డి, జనతా పార్టీకి చెందిన చిలకం రామచంద్రారెడ్డి పోటీపడగా 7453 ఓట్ల తేడాతో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. 1983లో టీడీపీ ఆవిర్భవించినా ఆ పార్టీ ఇక్కడ పోటీ చేయలేదు. ఇండిపెండెంట్ అభ్యర్థి ఈవీ గోపాల్ రాజు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రెడ్డివారి చెంగారెడ్డితో పోటీపడి 12152 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1985లో టీడీపీ ఈ నియోజకవర్గంలో తొలిసారి పోటీ చేసింది. అయితే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రెడ్డివారి చెంగారెడ్డి టీడీపీ అభ్యర్థి రాధాకృష్ణపై 1142 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1989లో కాంగ్రెస్ పార్టీనే విజయం సాధించింది. 1994లో టీడీపీ అభ్యర్థి దొరస్వామి రాజు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెంగారెడ్డిపై 13105 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఇదే ఈ నియోజకవర్గంలో టీడీపీ తొలి విజయం. 1999, 2004లో కాంగ్రెస్ పార్టీ వరుస విజయాలను సొంతం చేసుకుంది. 2009లో నియోజకవర్గ విభజన జరగడంతో నగరి, పుత్తూరు నియోజకవర్గాలు మిళితమై నగరి నియోజకవర్గం ఏర్పడింది. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెంగారెడ్డిపై టీడీపీ అభ్యర్థి గాలి ముద్దుకృష్ణమనాయుడు 1308 ఓట్ల తేడాతో గెలుపొందారు. 2014లో నియోజకవర్గం నుంచి తొలి మహిళ అభ్యర్థి ఆర్కే రోజా టీడీపీ అభ్యర్థి గాలిముద్దుకృష్ణమనాయుడుపై 858 ఓట్ల తేడాతో గెలుపొందారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆర్కే రోజా 2708 ఓట్ల మెజారిటీతో రెండవ సారి గెలుపొందారు. నియోజకవర్గం ఏర్పడిన తరువాత 13 ఎన్నికలు జరిగితే ఇప్పటి వరకు టీడీపీ రెండుసార్లు మాత్రమే గెలుపొందింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పడి జరిగిన రెండు ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఇప్పటివరకు కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్, టీడీపీ, ప్రజారాజ్యం, లోక్‌సత్తా, ఇండిపెండెంట్లు పోటీచేశారు.

నియోజకవర్గ ప్రత్యేకతలు



- మరమగ్గనేతకు నియోజకవర్గం ప్రసిద్ధి. 16వేల మరమగ్గాలు ఈ ప్రాంతంలో ఉండగా 25వేల కుటుంబాలు ఈ వృత్తిపై ఆధారపడి ఉంది. కాటన్ దుస్తుల నేత, చుడీదార్లు తయారీకి నియోజకవర్గం ప్రసిద్ధి గాంచింది.
- పుత్తూరు శల్యవైద్యం జాతీయ స్థాయిలో ప్రఖ్యాతి గాంచింది.
- పుత్తూరు ద్రౌపదీ, ధర్మరాజుల తిరనాళ్లు వైభవంగా జరుగుతుంది. మూడు రాష్ట్రాల నుంచి భక్తులు ఇక్కడి వస్తారు. 10 రోజుల పాటు వైభవంగా జరుగుతుంది. యాభైవేల మంది భక్తులు దర్శించుకుంటారు.
- సంక్రాంతి పండుగ సమయంలో నగరి పట్టణంలో నిర్వహించే కొండచుట్టు వేడుకలకు పరిసర ప్రాంతాల నుంచి 21 మంది దేవతలు రావడం జిల్లాలో ప్రత్యేకతను సంతరించుకుంటుంది. ఈ వేడుకలకు ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో జనం తరలివస్తారు.
- నగరి పట్టణంలో నేత్ర ప్రదాయణీ క్షేత్రం కన్నులను కాపాడే ఆలయంగా ప్రసిద్ధి పొందింది. ఆడి నెలలో ఈ ఆలయం జనంతో కిక్కిరిసిపోతుంది.
- అంతర్జాతీయ స్థాయి ఖ్యాతి గడించిన తిరుమలలో వెలసిన వేంకటేశ్వర స్వామి అప్పలాయగుంటలో భిన్నంగా అభయహస్తం చూపుతూ ఇక్కడ వెలసి ఉండడం ప్రత్యేకత. తిరుమలకు వెళ్లే భక్తులు ఇక్కడకు విచ్చేసి స్వామివారి అభయం పొందుతారు.
- కాశీలో వలే అన్ని దేవతలు కొలువుదీరి దక్షిణకాశీగా పిలవబడే కాశీవిశ్వేశ్వరాలయం నగరి బుగ్గ అగ్రహారంలో వెలిసింది. చోళుల పాలనలో నిర్మించి, కార్వేటినగరం రాజులు నవీకరించి ప్రస్తుతం టీటీడీ ఆధీనంలో ఉన్న ఈ ఆలయంలో కార్తీక మాసం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.
- దక్షిణ భారతదేశంలో లేనివిధంగా కొత్త రూపంలో నిర్మించిన సీఎస్ఐ చర్చి విజయపురం మండలం పన్నూరులో ఉంది. క్రిస్మస్ వేడుకల సమయంలో ఇక్కడ క్రైస్తవులు ఎక్కువగా హాజరవుతారు.
- స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్లు, డయాలసిస్ వార్డు అంటూ ఆధునీకరణ జరగడంతో ఉన్నత వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి.
- ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటీ కళాశాలలు, మాస్టర్ డిగ్రీ, ఎంఫిల్, ఎంబీఏ, ఎంసీఏ, లా కోర్సులు నియోజకవర్గంలోనే ఉండడంతో విద్యా కేంద్రంగా నియోజకవర్గం విరాజిల్లుతోంది.

నగరి నియోజకవర్గంలో జూన్ 2019 నుంచి జూన్ 2023 వరకు వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (కోట్లలో)
పెన్షన్ కానుక	38798	468.38
జగనన్న అమ్మ ఒడి	74633	111.95
వైఎస్సార్ ఆసరా	43781	134.20
వైఎస్సార్ చేయూత	13129	118.18
అందరికీ ఇళ్లు	9513	139.45
వైఎస్ఆర్ రైతు భరోసా	23558	84.33
పీఎం కిసాన్	22713	50.37
వైఎస్సార్ సున్న వడ్డీ పంటరుణాలు	2357	0.55
విత్తన పంపిణీ	10778	2.42
వ్యవసాయ ఇన్‌పుట్ సబ్సిడీ	598	0.42
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	138	0.04
యంత్రసేవా పథకం	58	1.15
జగనన్న విద్యాదీవెన	22758	34.05
జగనన్న వసతి దీవెన	22672	21.63
వైఎస్సార్ బీమా	313	3.98
వైఎస్సార్ పశుబీమా,	1397	0.13
పశునష్టపరిహార పథకం	867	2.54
వైఎస్సార్ నేతన్న నేస్తం	217	2.20
కాపునేస్తం	1032	1.55
ఈబీసీ నేస్తం	5712	8.57
కంటి వెలుగు	53430	1.28
వైఎస్సార్ వాహన మిత్ర	1747	1.73
ఇతర పథకాలు		
జగనన్న చేదోడు	2660	2.67
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	9187	4.52
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	3722	4.00
వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా	255	1.53
అర్చకులు, ఇమామ్‌లు, ముజిందారిస్,పాస్టర్స్ ఆర్థిక సాయం	45	0.68
జగనన్న విదేశీ విద్యాదీవెన	2	1.05
మొత్తం	366070	1203.55
నాన్ డీబీటీ పథకాల లబ్ధి		
జగనన్న తోడు	13989	13.89
జగనన్న గోరుముద్ద	60940	5.88
జగనన్న విద్యాకానుక	106885	17.87
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	69283	9.78
అందరికీ ఇళ్లస్థలాలు	11082	11.23

నియోజకవర్గ స్వరూపం ఇదీ..

1962లో నగరి నియోజకవర్గంగా గుర్తింపు పొందింది. అప్పట్లో ఈ నియోజకవర్గంలో నగరి, నింద్ర, విజయపురం, కార్వేటినగరం, నారాయణవనం మండలాలు ఉండేవి. 2009లో నియోజకవర్గ విభజనలో నగరి నియోజకవర్గానికి చెందిన కార్వేటినగరం మండలం గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి, నారాయణవనం మండలం సత్యవేడు నియోజకవర్గానికి వెళ్లగా పుత్తూరు నియోజకవర్గానికి చెందిన పుత్తూరు, వడమాలపేట మండలాలు నగరి నియోజకవర్గంలో కలిశాయి. ప్రస్తుతం నగరి, నింద్ర, విజయపురం, పుత్తూరు, వడమాలపేట మండలాలతో నగరి నియోజకవర్గం కొనసాగుతోంది. 2022 జిల్లాల విభజనలో నియోజకవర్గంలోని నగరి, నింద్ర, విజయపురం చిత్తూరు జిల్లాకు, పుత్తూరు, వడమాలపేట మండలాలు తిరుపతి జిల్లాకు చేరాయి. దీంతో రెండు జిల్లాలు, రెండు మున్సిపాలిటీలు కలిగిన నియోజకవర్గంగా నగరి గుర్తింపు పొందింది. నియోజకవర్గానికి దక్షిణం, తూర్పు సత్యవేడు నియోజకవర్గం, తమిళనాడు సరిహద్దు, ఉత్తరం తిరుపతి రూరల్ నియోజకవర్గం, పడమర తమిళనాడు సరిహద్దు, గంగాధర నెల్లూరు నియోజకవర్గాలు ఉన్నాయి.